

ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి-కాశినాయన

మండల కేంద్రమైన బాలాయపల్లె గ్రామంలో మారెమ్మ ఆలయ ప్రతిష్టలో భాగంగా బుధవారం ఎడ్లకు బండలాగు పందెం పోటీలు నిర్వహించారు. బాపట్ల జిల్లా చుండూరు మండలం వెంకట పాలెం గ్రామానికి చెందిన ఆర్కే బుల్స్ యజమాని ఎడ్లకు మొదటి బహుమతి రూ.40 వేలు కైవసం చేసుకున్నాయి. రెండవ బహుమతి తెలంగాణ రాష్ట్రానికి చెందిన రాయవరం రామచంద్రారెడ్డి ఎడ్లు కైవసం చేసుకున్నాయి. ఆలయ కమిటీ వారు ఏడు బహుమతులను ఏర్పాటు చేశారు. మూడు రోజుల నుండి మారెమ్మ తిరుణాల ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి బంధుమిత్రులు, స్నేహితులు తండోపతండాలుగా వచ్చారు. ఇక్కడ అన్నదానం కూడా ఏర్పాటు చేశారు.

ఇరిగేషన్ ఎస్ఇకి సెగ!

- చెప్పింది చెయ్..లేకపోతే సెలవుపై వెళ్లిపో..
- జిల్లాకు చెందిన అధికార పార్టీ నాయకుడి ఒత్తిడి
- తెరవెనక ఓ సీనియర్ ఇంజినీరింగ్ అధికారి?!

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా నీటిపారుదల శాఖలో ఇంటిపోరు నడుస్తోంది. జిల్లా నీటిపారుదల శాఖలో పెద్దఎత్తున బదిలీలు జరిగిన సంగతి తెలిసిందే. ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా అనంతపురం జిల్లా నుంచి ఓ సీనియర్ ఇంజినీరింగ్ అధికారి బదిలీపై వచ్చిన సంగతి తెలిసిందే. జిల్లాకు చెందిన ఓ ఇంజినీరింగ్ అధికారి ఇటీవలి వరకు ఐదు పోస్టులను నిర్వర్తిస్తున్నారు. ఇటీవలి బదిలీల్లో భాగంగా ఆయన పరిధిలోని ఐదు స్థానాలకు ఐదుగురు ఇంజినీరింగ్ అధికారులు రావడానికి సిద్ధపడినట్లు సమాచారం. ఆయన పరిధిలోని ఐదు పోస్టుల్లో ఓ సూపరింటెండెంట్ స్థాయి పోస్టును కోల్పోయారు. సదరు ఇంజినీరింగ్ అధికారి సర్కిల్ సూపరింటెండెంట్ పోస్టులను టార్గెట్ చేసినట్లు ఇరిగేషన్ ఇంజినీరింగ్ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. ఆయన తనకు కొన్నేళ్ల నుంచి పరిచయం కలిగిన రాజకీయ నాయకుల దగ్గరికి వెళ్లి పితూరీలు చెప్పడం, చేయకూడని పనులు చేయాలని ఒత్తిడి రాజకీయం నెరవుతున్నాడనే వాదన వినిపిస్తోంది. పనులు చేయనిపక్షంలో సెలవుపై వెళ్లిపోవాలని జిల్లాకు చెందిన అధికార పార్టీకి చెందిన రాజకీయ నాయకుల చేత హుకూంలు జారీ చేయిస్తున్నాడనే విమర్శలు ఉన్నాయి. ఏమి చేయాలో తెలియని సర్కిల్ ఎస్ఇ దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు సమాచారం. ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఇ సెలవుపై వెళ్తే ఆయన స్థానాన్ని దక్కించుకోవాలనే ఉద్దేశంతో పావులు కదుపుతున్నాడనే విమర్శ వినిపిస్తోంది. ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండెంట్‌పై ఆయనకుంటే తక్కువ స్థాయి కలిగిన ఇంజినీరింగ్ అధికారి ఇటువంటి పైరవీలు చేస్తుండడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.



ఇరిగేషన్ ఎస్ఇ కార్యాలయం

భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

- నష్టపరిహారం ఇవ్వకపోతే ఆందోళనలు
- రైతుల పక్షాన ప్రజాప్రతినిధులు స్పందించాలి
- పంట పొలాల పరిశీలనలో ఏపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-బ్రహ్మంగారిమఠం

మండలంలో గ్రీన్ ఫీల్డ్ హైవేలో భూములు పోతున్న రైతులందరికీ న్యాయమైన నష్టపరిహారం ఇవ్వకపోతే ఆందోళన తప్పదని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం మల్లేపల్లె పంచాయతీ పరిధిలోని చెంచయ్యగారిపల్లి, శ్రీరంగనగర్, లింగాలదిన్నె, ఎద్దులయ్యపల్లి, తదితర గ్రామాల్లో భూములు కోల్పోతున్న పంట పొలాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న రైతులతో ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా భూముల్లో రోడ్డు వేయడం చాలా దుర్మార్గమైందని తెలిపారు. గతంలో గ్రామసభలు పెట్టినప్పుడు రైతులకు నష్టపరిహారం ఇచ్చిన తర్వాతే రోడ్డు పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చిన రెవెన్యూ అధికారులు ఈరోజు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తహశీల్దార్ కార్యాలయంలో రైతు భూములకు సంబంధించి సాంకేతిక లోపంతో సమస్యలు ఉండడంతో వాటిని పరిష్కరించి రైతుల భూములు పోతున్న రైతులందరికీ నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఎన్నికల ముందు ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు నేషనల్ హైవేలో రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న వారందరికీ నష్టపరిహారం ఇప్పించే బాధ్యత మాదని చెప్పి ఇప్పుడు ఏమయ్యారని ప్రశ్నించారు. నేషనల్ రోడ్డు విస్తరణలో రోడ్డు వేస్తున్న సందర్భంలో పంట పొలాలన్నీ దుమ్ము, ధూళితో పంటలకు తీవ్రమైన నష్టం వాటిల్లుతున్నదని చెప్పారు. రోడ్డు అధికారులు ఏమాత్రం కనికరం కూడా చూపలేదని తెలిపారు. రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న వారందరికీ జిల్లా, మండల రెవెన్యూ అధికారులు, నేషనల్ రోడ్డు హైవే అధికారులు చర్చించి అందరికీ నష్టపరిహారం ఇవ్వాలని లేని పక్షంలో రైతులను కలుపుకొని దశల వారి ఆందోళన పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. పచ్చని చెట్లు, షెడ్లు, బోర్లకు తగిన పరిహారం అందించాలన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించకుండా హైవే పనులు జరగనివ్వమని చెప్పారు. రైతులకు న్యాయం చేయకుండా పనులు చేపడితే అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శివకుమార్, ప్రజా సంఘాల నాయకులు సునీల్ కుమార్, విజయ్ కుమార్, అజయ్ కుమార్, రాహుల్, దేవా, శ్రీనివాసులు, గురు బ్రహ్మాచారి, నారాయణ పాల్గొన్నారు.



గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను పరిశీలిస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

పకడ్బందీగా భూముల రీసర్వే : జెసి


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదితి సింగ్

ప్రజాశక్తి - కడప

జిల్లాలో భూముల రీసర్వే వేగవంతంగా, పకడ్బందీగా నిర్వహించి నివేదికలు సమర్పించాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. బుధవారం విజయవాడ నుండి భూముల రీసర్వేపై అదనపు సిసిఎల్ఎ నక్కల ప్రభాకర్‌రెడ్డితో కలసి సిసిఎల్ఎ జి.జయలక్ష్మి అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భగా సిసిఎల్ఎ జి.జయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాల్లో భూముల రీసర్వేపై ప్రత్యేక శ్రద్ధ వహించి పకడ్బందీగా నిర్వహించాలని, నివేదికలు పంపాలని, నివేదికల ఆధారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ విషయంపై క్షేత్ర స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. భూముల రిసర్వే ప్రక్రియ రెవెన్యూ శాఖలో అతి ముఖ్యమైన అంశమని పేర్కొన్నారు. ఎలాంటి జాప్యం, నిర్లక్ష్యం వహించారాదన్నారు. సిసిఎల్ఎ వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కడప కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుండి ప్రజలకు అందాల్సిన పౌర సేవలు సంతృప్తి స్థాయిలో అందాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతి ఒక్కరు నిబద్ధతతో పనిచేయాలన్నారు. రెవెన్యూ శాఖలో ఎక్కడా కూడా పెండింగ్ అంశాలు లేకుండా చూడాలన్నారు. జిల్లాలో భూముల రీసర్వే వేగవంతంగా, పకడ్బందీగా నిర్వహించి నివేదికలు సమర్పించాలని పేర్కొన్నారు. భూముల రీసర్వేలో రెవెన్యూ, సర్వే ల్యాండ్ శాఖల అధికారులు నేరుగా రైతుల వద్దకే వెళ్లి వివరాలు సేకరించి, రికార్డులను పరిశీలించి నివేదికలు తయారు చేయాలని తెలిపారు. అధికారులు కచ్చితంగా క్షేత్ర స్థాయికి వెళ్లి భూముల రిసర్వే పై అబ్సర్వేషన్ చేయాలన్నారు. భూ రికార్డులను సంతృప్తి కరంగా ఏలాంటి లోటుపాట్లను లేకుండా అప్డేట్ చేయాలని పేర్కొన్నారు. ఇందుకు ఆయా తహశీల్దార్, విఆర్ఒలు భాద్యత నివహించాలన్నారు. విలేజ్ బౌండరీ, గ్రౌండు బౌండరీ తప్పనిసరిగా చేయాలని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చిత సమాధానము ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, రెవెన్యూ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అమెరికా దుశ్చర్యను వ్యతిరేకిస్తూ నిరసన


నిరసన తెలుపుతున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-బద్వేలు

అమెరికా నుంచి వందలాది మంది భారతీయులని బహిష్కరించి తీవ్రవాదులకు, యుద్ధ ఖైదీలుకు వేసినట్లు కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి వారిని యుద్ధ విమానాల్లో తీసుకురావడాన్ని ఖండిస్తూ డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ అమెరికాలో వలసదారులుగా ఉన్న భారతీయులను కాళ్లు చేతులకు సంకెళ్లు వేసి యుద్ధ ఖైదీల్లాగా పంపించడం తగదన్నారు. యుద్ధంలో పట్టుబడిన ఖైదీలను కూడా గౌరవంగా చూడాలని నిబంధనలు ఉన్నాయని, ప్రధాని మోడీ అనుసరించిన ఆర్థిక విధానాలు నిరుద్యోగాన్ని పెంచి పోషించడం వల్లే గత్యంతరం లేక భారతదేశ యువత వలస వెళ్తున్నారన్నారు. వికసిత్ భారత్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఒక మూలకు కూడా సరిపోదన్నారు. మేకింగ్ ఇండియా పేరుతో దేశంలో ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోడీ, ఆ దిశగా అడుగులు వేయలేదన్నారు. భారతదేశం నిరుద్యోగంలో రోజురోజుకీ పైస్థాయికి వెళుతుందే తప్ప నిరుద్యోగం రూపుమాపే పరిస్థితి మోడీ హయాంలో ఎక్కడా జరగలేదన్నారు. అంబానీ, అదానీలకు ఊడిగం చేసే విధానాలు తెస్తూ కార్పొరేట్ శక్తులను మరింత ధనవంతులు చేసే విధానాలు తీసుకొని వస్తూ దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థల అన్నింటిని ప్రైవేటుపరం చేస్తూ దేశాన్ని గుజరాతీలకు తాకట్టు పెడుతున్నారన్నారు. అమెరికాలో భారతీయుల పట్ల అమెరికా వైఖరి దుశ్చర్యను కనీసం ఖండించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబు, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె.మస్తాన్ షరీఫ్, ఎస్.కె.దిల్, డివైఎఫ్ఐ మహిళా జిల్లా కన్వీనర్ సి.గురుదేవి, మండల అధ్యక్ష, కార్యదర్శులు ముడమాల ఓబుల్‌రెడ్డి, ఉప్పులూరు బాల గురవయ్య, పట్టణ నాయకులు నరసింహ, ప్రసాద్‌రెడ్డి, సుధాకర్, పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

ఎపిజిబిని కడపలోనే కొనసాగించాలి

ప్రజాశక్తి-కడప

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా ప్రభుత్వాన్ని కోరారు. రైతులు, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉన్న ఎపిజిబి కార్యాలయాన్ని కడప నుంచి అమరావతికి తరలించవద్దని బుధవారం ప్రభుత్వానికి లేఖ ద్వారా కోరారు. ఈ బ్యాంకు రైతులకు, కర్షకులకు, మధ్యతరగతి ఖాతాదారులకు అందరికీ ఎంతగానో ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు. కరువు పీడిత వెనుకబడిన ప్రాంతమైన కడపలో బ్యాంకు ఉనికి ప్రాంతీయ అభివృద్ధికి కీలకంగా మారిందని తెలిపారు. గతంలో దేశవ్యాప్తంగా 193 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఉండేవని, 2006లో కేంద్ర ప్రభుత్వం వాటిని 43గా కుదించిందన్నారు. ఎపిజిబిని అమరావతికి తరలించే ఆలోచనలను ప్రభుత్వం విరమించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. ఎపిజిబి అన్ని రంగాలలో వ్యాపార పరంగా అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు. 2,800 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, మిగిలిన మూడు గ్రామీణ బ్యాంకుల్లో ఉద్యోగులను కలిపినా అంతమంది లేరని పేర్కొన్నారు. కార్యాలయాన్ని యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని విన్నవించారు.

ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రాణం ఎంతో విలువైనదని, రోడ్డు ప్రమాదాల వల్ల ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు రాకుండా ట్రాఫిక్ విధుల్లో ఉండే హోంగార్డ్స్ సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని ట్రాఫిక్ సిఐ జావేద్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో బుధవారం ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధలు పాటించేలా చూడాలన్నారు. రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, అతి వేగం, నిర్లక్ష్యంగా నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటాయని తెలిపారు. ప్రతి వాహన చోదకుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మైనర్లు వాహనాలు నడపరాదని, అతి వేగం, ట్రిపుల్ రైడింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేసేవారు, సీట్ బెల్ట్ ధరించని వారు, హెల్మెట్ ధరించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని హోంగార్డులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-కడప

బేడ బుడగ జంగం మహిళలకు రక్షణ కల్పించాలని ఆ సంఘం హక్కుల పోరాట సమితి నాయకులు పస్తం అంజి అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటకలోని ఇంద్ర నగర్‌కు చెందిన సామమ్మ, శమమ్మలను ఆరుగురు యువకులు అత్యాచారం చేసి హత్య చేశారన్నారు. ఆ రాష్ట్ర ప్రభుత్వం హంతకులను శిక్షంచలేదన్నారు. హత్యకు గురైన ఇద్దరు మహిళలకు రూ.30 లక్షలు నష్టం పరిహారం ఇవ్వాలని కర్ణాటక ప్రభుత్వని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులో ఉండే బేడ బుడగ జంగాల కులం ఆడపడుచులకు అన్యాయం జరుగుతుంటే ప్రభుత్వ చట్టాలు వర్తించవా అని ప్రశ్నించారు. తెలంగాణలో లక్ష్మీ అనే బుడగ జంగం మహిళను వ్యాపార నిమిత్తం పోతే అతి కిరాతకంగా లైంగిక దాడి చేసి చంపారని గుర్తుచేశారు. వారికి తెలంగాణ ప్రభుత్వం ఉరిశిక్ష వేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరీ దారుణమని ఇంతవరకు మాకు కులధ్రువీకరణ సర్టిఫికెట్ లేక ఎన్నో రకాలుగా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఉన్న బేడ బుడగ జంగం మహిళలకు రక్షణ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సి.వెంకటేష్, పి.ఆంజనేయులు, పి.శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పస్తం అంజి

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-బద్వేలు : గోపవరం గ్రామ పొలం 68/2, 68/3 సర్వే నెంబర్లలో 30 సంవత్సరాల క్రితం ఎస్సీ, ఎస్టీలకు ఎకరా, బిసిలకు ఎకరా స్థలాన్ని శ్మశాన వాటికలకు కేటాయించిన రెవెన్యూ అధికారులు ఇప్పుడు 68/2, 68/3 సర్వే నెంబర్‌లలో రెండు ఎకరాల భూమిని ఆక్రమించి ఫెన్సింగ్ వేసిన భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని బిఎస్‌పి నియోజకవర్గ అధ్యక్షులు నుసిమి గౌస్ పీర్ డిమాండ్ చేశారు. బుధవారం దళిత నాయకులు ప్రసాద్, గొల్లపల్లి శ్రీనివాసులు కబ్జాకు గురైన శ్మశాన వాటికలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బద్వేల్ చుట్టుపక్కల ప్రాంతాలలో ఉన్న విలువైన భూములు, చెరువులు, వంక పోరంబోకు భూములు అన్నిటిని ఆక్రమించి కంచెలు ఏర్పాటు చేసి షెడ్లు వేసి భూకబ్జాదారులు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల శ్మశాన వాటికలను సైతం ఆక్రమించి కంచెను ఏర్పాటు చేసి దౌర్జన్యాలకు పాల్పడుతున్నా రెవెన్యూ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రెవెన్యూ అధికారులు ఇప్పటికైనా స్పందించి భూకబ్జాదారులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే ప్రజలను కూడగట్టి రెవెన్యూ ఆఫీసుల ఆవరణంలో నిరసన కార్యక్రమాలు చేయబడతామని హెచ్చరించారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎస్‌వి విద్యార్థి


ప్రజాశక్తి-కడప అర్బన్ : కడప నగరంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలకు చెందిన రెడ్డిరోహిత్ కుమార్ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. 2024, అక్టోబర్‌లో నంద్యాల జిల్లాలోని రాష్ట్ర స్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనపరిచినందుకు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ పోటీలు జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో ఈ నెల 22 నుంచి 26 వరకు ఉంటాయి. ఈ ఎంపిక పట్ల ఎస్‌వి కాలేజీ ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శిక్షణ ఇచ్చిన రాజశేఖర్‌కు, అసోసియేషన్ సెక్రటరీ లక్ష్మణ్‌కి తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఎస్‌జిఎఫ్ఐ అండర్-14, సబ్ జూనియర్స్ రెండేసి సార్లు, జూనియర్స్ మూడుసార్లు పాల్గొని రాష్ట్రస్థాయిలో ప్రశంసలు పొందాడు.

ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

ప్రజాశక్తి-కడప అర్బన్ : నగరపాలక సంస్థ పరిధిలో ఉర్దూ పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల, ఉపాధ్యాయుల పోస్టులు వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) వైఎస్ఆర్ జిల్లా శాఖ డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, జుబేర్ అహ్మద్, ఆర్థిక కార్యదర్శి కరామతుల్లా జిల్లా కేంద్రంలోని ఉర్దూ పాఠశాలల క్షేత్రస్థాయి సమస్యలు తెలుసుకునేందుకు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలలలో సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థుల చదువులు కుంటపడుతున్నాయని, సాలె నాగయ్య, నకాష్ ఉర్దూ ఉన్నత పాఠశాలలు ఉన్నతికరించి దశాబ్ద కాలం గడుస్తున్న ప్రధానోపాధ్యాయ పోస్టులు మరియు అవసరమైన స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు కాకపోవడం పై ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీసులపై జగన్ వ్యాఖ్యలు సిగ్గుచేటు : టిడిపి

ప్రజాశక్తి-కడప అర్బన్ : మాజీ సిఎం జగన్ పోలీసులను బట్టలు ఊడదీయించి కొడతానని మాట్లాడడం సిగ్గుచేటని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా మాట్లాడుతున్నారని చెప్పారు. ప్రజలు ఒక్కసారి నమ్మి అవకాశం ఇస్తే, అధికారం ఉందని, ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన కొనసాగించారన్నారు. బీటెక్ రవి, చంద్రబాబును అక్రమ అరెస్టు చేయించి జగన్ శునకానందం పొందారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి మాట్లాడుతూ పులివెందులలో మహిళ హత్య గావింపబడితే, ఆ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళితే మాపై పెట్టిన కేసులు ఇప్పటికే నడుస్తున్నాయని, కోర్టుల చుట్టూ తిరుగుతున్నామని చెప్పారు.


మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

జిజిహెచ్‌లో బ్రాంకోస్కోపి మిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-కడప సిటీ

ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రిలో పల్మనరి మెడిసిన్ విభాగంలో రూ.20 లక్షల ఖరీదైన నూతన బ్రాంకోస్కోపి పరికరాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండే విధంగా రిమ్స్‌లో ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ పరికరంతో పల్మనాలజీ వైద్యులు, ఊపిరితిత్తులు గాలిగొట్టాల్లో క్యాన్సర్, వివిధ మందులతో తగ్గని దగ్గు, ఆయాసం నెమ్ము లక్షణాలు కలిగిన వాళ్ల రోగనిర్ధారణకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ నూకరాజు పేర్కొన్నారు. ఊపిరితిత్తుల గాలి గొట్టాలలో ఉన్న మ్యూకస్ ప్లెగ్లు ఫారిన్ బాడీ మొదలగు వాటిని తొలగించుటకు ఉపయోగించవచ్చన్నారు.


బ్రాంకోస్కోపి మిషన్‌ను ప్రారంభిస్తున్న రమాదేవి

మల్లికార్జునకు వైవీయూ డాక్టరేట్

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగివేమన విశ్వవిద్యాలయం వ్యాపార నిర్వహణ (బిజినెస్ మేనేజ్‌మెంట్)లో యడ్డానపూడి మల్లికార్జున ఆచారికి డాక్టరేట్ ప్రకటించింది. వైవీయూలో స్కాలర్‌గా ఉన్న ఆయన, వ్యాపార నిర్వహణ విభాగంలోని సహా ఆచార్యుడు డాక్టర్ పి.వి.వరప్రభాకర్ పర్యవేక్షణలో పరిశోధన నిర్వహించారు. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతంలోని మ్యూచువల్ ఫండ్ పెట్టుబడిదారుల పెట్టుబడి ప్రవర్తన, వైఖరిపై అధ్యయనం' అనే అంశంపై పరిశోధన చేసి గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. మల్లికార్జునను వైవీయూ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ రఘునాథ్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, పిఆర్ సెల్ సంచాలకులు డాక్టర్ పి.సరిత, అధ్యాపకులు, విద్యార్థులు, స్కాలర్లు ఆయనను అభినందించారు.

సత్య నాగేంద్రరావుకూ డాక్టరేట్

యోగి వేమన విశ్వవిద్యాలయం అప్లైడ్ మాథమెటిక్స్ స్కాలర్ ఎస్.సత్యనాగేంద్రరావుకు విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయన తన పరిశోధనను ప్రొఫెసర్ జి.కాత్యాయని మార్గదర్శకత్వంలో నిర్వహించారు. సత్యనాగేంద్రరావు 'థియోరెటికల్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ మాగ్నెటో హైడ్రోడైనమిక్స్ ఫ్లో ఇన్ సస్పెన్షన్ ఆఫ్ నానోపార్టికల్స్' అనే అంశంపై పరిశోధన చేసి తన గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా సత్యనాగేంద్రరావును వైవీయూ విసి కె.కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి, డీన్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ ఎ.జి.దాము, ప్రొఫెసర్ రమేష్ బాబు అభినందించారు.

నేడు జిల్లాకు మాల కార్పొరేషన్ చైర్మన్ రాక

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎపి మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పి.విజయ్ కుమార్ గురువారం కడపకు రానున్నట్లు ఎస్‌సి కార్పొరేషన్ ఇడి రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఎస్‌పి నాయకులతో ముఖాముఖి నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆ తర్వాత కలెక్టరేట్‌లోని ఎస్‌సి కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.


క్షేత్ర స్థాయి పర్యటనలో ఉమెన్స్ కాలేజీ విద్యార్థులు

మహిళా కళాశాల విద్యార్థుల క్షేత్ర స్థాయి పర్యటన

ప్రజాశక్తి-కడప అర్బన్

కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో అర్థశాస్త్ర, చరిత్ర విభాగం ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు పాఠ్యాంశంలో భాగంగా అదనపు విజ్ఞానం కోసం క్షేత్ర పర్యటన చేశారు. ఈ క్షేత్ర పర్యటనలో విద్యార్థులు మొదట చారిత్రాత్మక ప్రదేశమైన తాళ్లపాకను సందర్శించి అక్కడ విశేషాలను గురించి తెలుసుకున్నారు. శ్రీకాళహస్తి దేవాలయాన్ని సందర్శించి అక్కడ విశిష్టతను గురించి విద్యార్థులు తెలుసుకున్నారు. టూరిజం వల్ల రాష్ట్రానికి, దేశానికి రవాణా సౌకర్యాలు పెంపొందించబడి, ఉద్యోగ అవకాశాలు పెరిగి ప్రజల ఆదాయలు పెరుగుతాయని విద్యార్థులు తెలుసుకున్నారు. శ్రీకాళహస్తి సమీపంలో ఉన్న హిందుస్థాన్ కోకాకోలా ప్రైవేట్ లిమిటెడ్‌ను సందర్శించి ఆ కంపెనీలో జరిగే శీతల పానీయాల ఉత్పత్తి గురించి, వాటి తయారీలో ఉపయోగించే పదార్థాల గురించి, తయారు చేసే విధానం గురించి, ప్యాకింగ్ గురించి, లేబ్లింగ్ గురించి, సాంకేతిక పరిజ్ఞానం గురించి, మార్కెటింగ్ అంశాల గురించి, ఉత్పత్తి, వినియోగం, ఆదాయం గురించి, ఉద్యోగ అవకాశాల గురించి తెలుసుకున్నారు. తర్వాత వరదయ్యపాలెం సమీపంలో ఉన్న ఏకం ఆధ్యాత్మిక క్షేత్రం సందర్శించి, క్షేత్ర నిర్మాణం గురించి, విశిష్టత గురించి విద్యార్థులు తెలుసుకున్నారు. క్షేత్ర పర్యటనలు విద్యార్థులతో పాటు అధ్యాపకులు డాక్టర్ జి.విజయలక్ష్మి దేవి, డాక్టర్ ఎం.గురు మోహన్‌రెడ్డి, డాక్టర్ పి.శచీదేవి, రవి శేఖర్‌రెడ్డి, నాగవేణి పాల్గొన్నారు.

జ్యువెలరీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలోని బికెఎం వీధిలో ది కడప జ్యువెలరీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా రాజశేఖర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా సయ్యద్ సలావుద్దీన్, ఆకుల రాజమోహన్, సెక్రెటరీగా సయ్యద్ చాంద్‌బాషా, ట్రెజరర్‌గా ఆకుల రాజశేఖర్, ఐదుగురు ఉపాధ్యక్షులు, ఐదుగురు జాయింట్ సెక్రెటరీలు, మిగతా కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఐకమత్యమే మహాబలమని, అందరూ కలిసికట్టుగా అసోసియేషన్‌లో పనిచేసి జ్యువెలరీ వ్యాపారస్తులుగా మంచి పేరు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో గోవిందు నాగరాజు, జ్యువెలరీ వ్యాపారస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి



విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్న అధికారులు

ఎట్టకేలకు కాలనీలో విద్యుత్ సదుపాయం

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రంలోని బిసి కాలనీలో ఎట్టకేలకు అధికారులు విద్యుత్ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు అధికారులు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. 2011లో ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలను మంజూరు చేసింది. అప్పటి నుంచి లబ్ధిదారులు పలు దపాలు విద్యుత్ వసతి కల్పించాలని అధికారులను కోరారు. కాలనీ ఏర్పడిన 14ఏళ్లకు వారికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తుండడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో చాపాడు టిడిపి నాయకులు, పార్లమెంట్ మైనార్టీ కార్యదర్శి అక్బర్ సలీమ్, మంగపట్నం మస్తాన్, అక్బర్, పెద్ద సుబ్బరాయుడు, విద్యుత్ అధికారులు సతీష్, రవీంద్ర, చెన్నారెడ్డి, కాంట్రాక్టర్ బుర్రి నాగరాజు పాల్గొన్నారు.

శ్రీవీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా పది రోజులపాటు బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పివి నారాయణ యాదవ్, కార్య నిర్వహణాధికారి కె శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమాలు బుధవారం అంకురార్పణతో ప్రారంభించారు. ఈనెల 28 వరకు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గురువారం అశ్వ వాహనంపై శ్రీవీరభద్రస్వామి దర్శనమిస్తారని వారి వసంతోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వారు తెలిపారు. ఆ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు.



వినతులు స్వీకరిస్తున్న జనసేన నేతలు

సామాన్యుడి గళం వినిపించేందుకే జనవాణి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

సామాన్యుడి గళం వినిపించేందుకు జనవాణి కార్యక్రమం నిర్వహించామని జమ్మలమడుగు జనసేన కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున తెలిపారు. జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం మంగళగిరిలో బుధవారం జనవాణి కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి తానూ వినతులు స్వీకరించానని పేర్కొన్నారు. ప్రతి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కడప జనసేన పార్టీ ప్రోగ్రాం కమిటీ మెంబర్ పవన్‌కుమార్, దుత్తలూరు శేఖర్‌రెడ్డి, చిన్న ఓబులేసు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న మహేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

విభిన్నప్రతిభావంతులకు అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మండలంలోని ఆర్.తుమ్మలపల్లె గ్రామానికి చెందిన మాజీ జెడ్పిటిసి తుమ్మల మహేశ్వర్‌రెడ్డి రెండవ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుటుంబ సభ్యులు బుధవారం విభిన్నప్రతిభావంతులకు అన్నదానం చేశారు. స్థానిక పవర్ ట్రాక్టర్ షోరూమ్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో కుటుంబసభ్యులు మహేశ్వర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మహేశ్వర్‌రెడ్డి కుమారుడు తుమ్మల హేమంత్‌కుమార్ రెడ్డి, ఆర్ తుమ్మలపల్లి సర్పంచ్ గజ్జల అనసూయ మహేశ్వర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అన్నదానం నిర్వహించిన తుమ్మల కుటుంబ సభ్యులకు విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ రాష్ట్రఅధ్యక్షుడు ఇరికెరెడ్డి రఘునాథరెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

మహిళ హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - వేముల

మండల పరిధిలోని స్థానిక కేకే కొట్టాల గ్రామానికి చెందిన శింగంశెట్టి సుబ్బరాయుడు భార్య శింగంశెట్టి పద్మావతి (54) హత్య కేసులో నిందితుడైన అదే గ్రామానికి చెందిన శింగంశెట్టి రమేష్‌ను అరెస్టు చేసి బుధవారం సాయంత్రం రిమాండ్‌కు తరలించినట్లు ఆర్కే వ్యాలీ సిఐ ఉలసయ్య, వేముల ఎస్ఐ పి.ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈనెల 2న పద్మావతి హత్యకు గురైన విషయం విదితమే. మృతురాలి భర్త వెంకటప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేశామన్నారు. నిందితుడి నుంచి బంగారు గొలుసు, కమ్మలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అరటి తోటకు ఆకతాయిల నిప్పు

- రూ.లక్షల్లో నష్టపోయిన కౌలు రైతు

ప్రజాశక్తి - వేంపల్లె

చింతలమడుగు సమీపంలో గుర్తు తెలియని ఆకతాయిలు అరటి తోటకు నిప్పు పెట్టినట్లు ఎర్రబోయిన రవి అనే బాధితుడు తెలిపాడు. ఈ ఘటన బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలు.. చక్రాయపేట మండలం సిద్దారెడ్డిగారి పల్లె గ్రామానికి చెందిన యర్రబోయిన రవి వేంపల్లె పంచాయతీలోని చింతలమడుగుపల్లె గ్రామ పొలాల్లో మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని అరటి పంటను సాగుచేస్తున్నాడు. ఆకతాయిలు అరటి తోటకు సమీపంలో చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి రెండు ఎకరాల మేర అరటి చెట్లు దగ్ధమయ్యాయి. ప్లాస్టిక్ పైపులు, డ్రిప్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. చుట్టుపక్కల ఉన్న రైతులు గమనించి బాధితుడికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నంలోనే రెండెకరాల అరటితోట దగ్ధమైంది. ఇప్పటికే రూ.7 లక్షల పెట్టుబడి పెట్టానని, డ్రిప్ మరో రూ.2 లక్షల వరకు ఖర్చు చేశానని రవి వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

యథేచ్ఛగా మట్టి అక్రమ తరలింపు

బీళ్లుగా మారుతున్న పంట పొలాలు - ఆవేదన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు - 20 ఏళ్ల క్రితం ఎస్‌సిలకు కేటాయించిన పొలాలు



దళితుల భూముల్లో అక్రమంగా తవ్వుతున్న మట్టి

ప్రజాశక్తి - లింగాల

మట్టి మాఫియా పేట్రేగిపోతోంది. అధికారుల అండదండలను అడ్డు పెట్టుకుని వెనుకబడిన వర్గీయుల భూముల్లో అక్రమంగా మట్టిని తరలించి జేబులు నింపుకుంటున్నారు. ఈ వ్యవహారం అంతా అధికారుల కళ్లకు కనిపిస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగుకు ఉపయోగపడే భూముల్లో యాంత్రాల సాయంతో పెద్ద పరిమాణంలో గుంతలు తవ్వి మట్టిని అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆ భూములు పంట సాగుకు యోగ్యమైనా భూములుగా ఉపయోగపకుండా పోతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని ఎస్‌సి వర్గీయులకు 20ఏళ్ల క్రితం ప్రభుత్వం డికెటి పట్టాలను అసైన్మెంట్ కమిటీ భూములను పంపిణీ చేసింది. ఈ క్రమంలో ప్రభుత్వం మంజూరు చేసిన నలభై ఎకరాల్లో పది మంది రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. కాలక్రమేణా ఆర్థికస్తోమతలేని కొందరు రైతులు పంటలు సాగు చేయకుండా కొంత భూమిని బీడుగా వదిలేశారు. ఇదే అదనుగా మట్టి మాఫియా ఆ భూములపై కన్నేసింది. నాలుగు రోజులుగా యంత్రాల సాయంతో ఆ భూముల్లో మట్టి తవ్వి అక్రమంగా తరలిస్తున్నారు. వందల టన్నుల మట్టిని తోడేయడంతో ప్రస్తుతం ఆ భూములు పంటల సాగుకు పనికిరానివిగా కనిపిస్తోంది. ఒక టిప్పర్ మట్టి రూ.2వేలు నుంచి రూ.3వేల వరకు నిర్ణయించి అమ్ముకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై పలుమార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టి మాఫియాను అడ్డుకోవాలని బాధితులు కోరుతున్నారు.



మట్టి తోలడంతో సాగుకు పనికిరాని పొలాలు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, భూపేష్, డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

యువత దేశ భవిష్యత్ అని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి సూచించారు. స్థానిక ఆర్అండ్‌బి బంగ్లా వద్ద బుధవారం డివైఎఫ్ఐ కడప జిల్లా కమిటీ ముద్రించిన సే నో టు డ్రగ్స్ పోస్టర్స్‌ను జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో యువత ఫ్యాషన్ పేరుతో చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు బానిసై తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటోందన్నారు. యువతకు అవగాహన కల్పించే ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ వారికి అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వం డ్రగ్స్ నిర్మూలనకు గట్టి కృషి చేస్తోందన్నారు. అధికారులకు కమిటీలు వేసి పర్య వేక్షిస్తూ డ్రగ్స్ నివారణకు చర్యలు చేపడుతోందని వారు పేర్కొన్నారు. డివై ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ మాట్లాడుతూ డివైఎఫ్ఐ పోరా టాలే కాదు సేవ, అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తుందన్నారు. డ్రగ్స్ వద్దు ఆరోగ్యం ముద్దు అని అందరం డ్రగ్స్ రహిత సమాజం కోసం అడుగులు వేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జమ్మలమడుగు అర్బన్ సీఐ లింగప్ప, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, సురేంద్ర చారిటబుల్ ట్రస్ట్ సురేంద్ర, డివై ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలి



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి నిత్యానందరాజు

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అంగన్‌వాడీలు కృషి చేయాలని సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి నిత్యానంద రాజు కోరారు. మండలంలోని లక్ష్మీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్న అంగన్వాడీల జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన సందర్శించారు. శిక్షణ ఏవిధంగా జరుగుతోంది.. ఎంతమంది హాజరయ్యారు.. శిక్షణలో ఎలాంటి కార్యక్రమాలు జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిఒ మాట్లాడుతూ విద్యార్థి దశ మొదలయ్యేది అంగన్వాడీల దగ్గరే అన్నారు. చిన్న పిల్లలకి శారీరక, మానసిక వికాసానికి మెరుగులు దిద్దుతూ పాఠశాలలకు విద్యార్థులను పంపేది అంగన్వాడీల నుంచే అని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న కొత్త విషయాలన్నిటిని అంగన్వాడీ సెంటర్లలో అమలు చేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఎంఇఒలు వి.రవిశంకర్, వి.వంశీకృష్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సుబ్బరత్నమ్మ, రాజ్యలక్ష్మి, ఆర్పీలు రిజ్వాన్ అలీ, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

వేముల : స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. సీడీపీవో సునీత మాట్లాడుతూ పిల్లల్లో సమగ్రాభివృద్ధి, వికాసం, అభ్యసన పద్ధతులు, సృజనాత్మకత పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రశేఖర్, రఫిక్, ఉపాధ్యాయులు మునీంద్ర, ప్రసాదు, చంద్రశేఖర్‌రెడ్డి, అంగన్వాడీ కార్యకర్తలు, ఐసిడిఎస్ సూపర్వైజర్ పాల్గొన్నారు.

క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం

- ఘనంగా ట్రిపుల్‌ఐటిలో స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

ప్రజాశక్తి - వేంపల్లె

క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. బుధవారం ఇడుపులపాయ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు పలు సలహాలు చేశారు. క్రీడలతో క్రమశిక్షణ, నైపుణ్యాన్ని పెంపొందించవచ్చు అన్నారు. చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. ప్రతిభతో తమ గుర్తింపు సాధించాలన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి రవికుమార్, అకాడమిక్ డీన్ రమేష్, డిఎస్‌డబ్ల్యూ కో-ఆర్డినేటర్ వెంకటేష్, ఫిజికల్ డైరెక్టర్లు పివి రమణారెడ్డి, బాలయ్య, షంషాద్ పాల్గొన్నారు.

పచ్చదనంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పచ్చదనంతోనే పర్యావరణం, ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం జమ్మలమడుగు మున్సిపాలిటీలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని రోడ్డు డివైడర్‌పైన మొక్కలను నాటడం వల్ల కాలుష్యం నివారించడమే ప్రధాన లక్ష్యమన్నారు. 2,582 మొక్కలు నాటడం గొప్ప కార్యక్రమమన్నారు. టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణ రెడ్డి, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గందరగోళంగా రాయితీ రుణాల ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - వేంపల్లె

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకొనేందుకు రాయితీ రుణాలలు పొందేందుకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమీపంలో ఉన్న వైఎస్ఆర్ సభా భవనంలో బుధవారం అభ్యర్థులకు నిర్వహించిన ఇంటర్వ్యూలు గందరగోళంగా మరాయి. ప్రతి అభ్యర్థి హాజరుకావడంతో సభా భవనం వారితో నిండి పోయింది. మండలానికి 38 యూనిట్లు మంజూరుకాగా, 806 మంది ఇంటర్వ్యూ హాజరయ్యారు. రద్దీ కావడంతో ఆయా బ్యాంకు అధికారులకు ఇంటర్వ్యూ చేసేందుకు వీల్లేకుండా పోయింది. బ్యాంకు అధికారులు ఏమి చేయని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. అభ్యర్థులు జిరాక్స్ కాపీలను అధికారులకు ఇచ్చి వెను తిరిగి వెళ్లిపోయారు. అవగాహన రాహిత్యంతో ఇంటర్వ్యూలు జరపడంతో గందరగోళంగా మారిందని పలువురు పేర్కొన్నారు. ఎవరి కన్నీళ్లు తుడవడానికీ ఈ ఇంటర్వ్యూలు అని అంటున్నారు.



ఇంటర్వ్యూకు హాజరైన దరఖాస్తుదారులు

దేవస్థాన స్థలం ఆక్రమణ కాకుండా చూడాలి

- తహశీల్దార్ హరినాథ్‌రెడ్డికి టిడిపి వినతిపత్రం

ప్రజాశక్తి - వేంపల్లె

పాపాఘ్ని నది అవతలి ఒడ్డున ఉన్న శ్రీవృషభాచలేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన స్థలం ఆక్రమణకు గురి కాకుండా చూడాలని దేవస్థానం మాజీ చైర్మన్ దుంపాల ఎద్దుల కొండ్రాయుడు, మాజీ ధర్మకర్త పివి రమణ, టిడిపి నేతలు కోరారు. ఆ మేరకు బుధవారం రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ హరినాథ్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎద్దుల కొండ సమీపాన ఉన్న పాపాఘ్ని నది ఒడ్డున వెలుగోటి సుబ్బయ్య అనే వ్యక్తి తన భూమి వరకే కాకుండా చుట్టు పక్కల ఉన్న దేవాలయ స్థలాన్ని ఆక్రమించుకొన్నాడని ఆరోపించారు. ఆక్రమణకు గురైన స్థలాన్ని కాపాడాలని, కంచెను తొలగించి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు హరిప్రవీణ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు పెడబల్లి సుష్మా, టిడిపి నేతలు బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి, సుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, జయుడు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

- విద్యార్థులకు ప్యాడ్‌లను అందజేసిన కరస్పాండెంట్ నారాయణరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నతస్థాయికి ఎదగాలని నారాయణ పాఠశాల కరస్పాండెంట్ కొట్టే నారాయణరెడ్డి పేర్కొన్నారు. నారాయణ పాఠశాలల తరుపున శ్రీసత్యసాయి జిల్లాలోని ఎన్‌పి కుంటలో ఉన్న కస్తూర్బా పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మెటిరియల్, ఎగ్జామ్ ప్యాడ్‌లను నారాయణరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో కస్తూరిబా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆప్కాస్‌ను రద్దు చేసి, దళారీ లేకుండా కార్మికులను పర్మినెంట్ చేయాలని సిఐటియు పట్టణ అధ్యక్షుడు ఏసుదాసు డిమాండ్ చేశారు. ఆ మేరకు బుధవారం ఆయన మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏసుదాసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న వ్యతిరేక విధానాలకు కార్మికులందరూ ఆప్కాస్ రద్దు చేయాలని కోరుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం కార్మికుల వ్యతిరేక విధానాలు అమలు చేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే పారిశుద్ధ కార్మికులకు ఇస్తున్న జీతాలు సరిపోక చాలా అవస్థలు పడుతూ జీవిస్తున్నారన్నారు. పుండు మీద కారం చల్లినట్లు కూటమి ప్రభుత్వం ఆప్కాస్ రద్దు అంటూ క్యాబినెట్‌లో చర్చలు జరిగాయని పత్రికా ప్రకటన రావడంతో కార్మికులు మానసికక్షోభకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ కార్మికులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు విజయ్, సిఐటియు కార్యదర్శి ఎస్ శేఖర్, బి నాగన్న, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పోలీసులపై జగన్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

ప్రజాశక్తి - వేంపల్లె

పోలీసులు, అధికారులపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని జైలు వద్దకు పోయి పరామర్శించడం తప్పు కాదన్నారు. తమ పార్టీకి చెందిన వ్యక్తి ఎలాంటి వాడైనా కష్టాలలో ఉన్నప్పుడు పరామర్శించి భరోసా ఇవ్వడం నాయకుడి లక్షణం, బాధ్యత అన్నారు. వంశీ అరెస్టు అక్రమమని, అతను సచ్ఛీలుడని వెనకేసుకొని రావడం సమంజసం కాదన్నారు. కేసు అక్రమమా, సక్రమమా అనేది కోర్టులో తేలుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పులివెందుల నియోజకవర్గంలో జగన్ గెలవడమే కష్టమని తులసిరెడ్డి అన్నారు.

సర్వేలో కేన్సర్ అనుమానితులను గుర్తించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

ఎన్‌సిడి సర్వేలో భాగంగా ప్రతి సచివాలయం నుంచి అనుమానిత కేన్సర్ కేసులను గుర్తించాలని పిహెచ్‌సి వైద్యాధికారి నాగార్జున్ సిబ్బందికి సూచించారు. స్థానిక పిహెచ్‌సిలో బుధవారం వైద్యాధికారి నాగార్జున్ ఆధ్వర్యంలో టిబి, ఎన్‌సిడి, సిడి సర్వే కార్యక్రమాలపై ఎఎన్ఎంలు, సిహెచ్‌ఒలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఎన్‌సిడి సర్వేలో ప్రతి సచివాలయం నుంచి బ్రెస్ట్, సర్వైకల్, ఓరల్ క్యాన్సర్ అనుమానిత కేసులను గుర్తించాలన్నారు. టిబి కేసులను గుర్తించి వారికి చికిత్స అందేలా చూడాలన్నారు. ప్రతి రోజు అన్ని సచివాలయాల నుండి ఐడిలను జనరేట్ చేయాలని ఆదేశించారు. నిర్ధేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు.

నీళ్లు మోస్తున్న హాస్టల్ విద్యార్థులు

ప్రజాశక్తి - ముద్దనూరు



సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహ విద్యార్థులు తాగునీరు కావాలంటే వారే తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు కోసం విద్యార్థులు బిందెలు, క్యాన్లను మోసుకుంటున్నారు. 200 మీటర్ల దూరంలో ఉన్న మినరల్ వాటర్ కేంద్రం వద్దకు వచ్చి నీటిని తీసుకెళుతున్నారు. బిందెలు, క్యాన్ల బరువు మోయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెగ్యులర్ వార్డెన్ బదిలీపై కమలాపురం వెళ్లడంతో ఉన్నతాధికారులు వీరపునాయునిపల్లె మండలానికి చెందిన హాస్టల్ వార్డెన్ ఇక్కడ ఇన్‌ఛార్జిగా నియమించారు. ఆయన ఎపుడో ఒక సారి వచ్చి వెళ్తుంటారు. హాస్టల్లో సిబ్బంది ఉన్నా విద్యార్థులతో నీళ్లు తెప్పించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యువతలో సాధించాలనే తపన ఉండాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

యువతలో సాధించాలనే తపన ఉండాలని డిఎస్‌పి వేంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులో బుధవారం ఆయన హంగ్రీ బర్డ్స్ నూతన ఫ్రూట్ జ్యూస్ సెంటర్‌ను ప్రారంభించారు. ముందుగా డిఎస్‌పి దుకాణ యజమాని జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా అభివృద్ధి కోసం ఇలాంటి దుకాణాలను పెట్టుకోవాలని సూచించారు. ప్రజల మన్ననలు పొందాలని, భవిష్యత్ వ్యాపార అభివృద్ధి జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు డిఎస్‌పి తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్, జ్యూస్ పాయింట్ ఓనర్ జగన్, సురేంద్ర చారిటబుల్ ట్రస్ట్ సీఈవో చింతకుంట సురేంద్ర, యువ బ్లడ్ డోనర్స్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ గురుప్రసాద్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు టీచింగ్ ప్యాకల్టీకి జీతాలు పెంచాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటిలో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచింగ్ ప్యాకల్టీ ఉద్యోగులకు జీతాలు పెంచాలని కాంట్రాక్టు టీచింగ్ ప్యాకల్టీ గెస్ట్ అసోసియేషన్ నాయకుడు నజీర్ హుసేన్ కోరారు. బుధవారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమార స్వామి గుప్తాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నజీర్ మాట్లాడుతూ తమ సమస్యలను వివరించారు. స్పందించిన డైరెక్టర్ కుమారస్వామి గుప్తా ఆర్జీయూకేటీ విసికి పంపి కాంట్రాక్టు ప్యాకల్టీలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.